
క్లుప్తంగా

వైభవంగా అశ్వ వాహనోత్సవం



కావలి: పట్టణంలోని బృందావనం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అశ్వ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



ఆత్మకూరు: విజయ దశమి పండగను పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అమ్మవారు ఆశీస్సులు ప్రతికుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.

వేడుకగా కన్య పూజ



అల్లూరు: స్థానిక వాసవీ కన్యకపరమేశ్వరి దేవస్థానంలో కన్య పూజను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. కావలికి చెందిన కోట జగదీష్, లావణ్య కుమార్తె జోషిత ఆద్య కామాక్షిను అమ్మవారిగా అలంకరించి వినాయకస్వామి మందిరం నుంచి కన్యకాపరమేశ్వరి దేవస్థానం వరకు గుర్రం మీద మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి కన్య పూజ జరిపారు.

వస్త్రాల పంపిణీ



కావలి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బందికి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్ తమ సొంత నిధులతో నూతన వస్త్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. బస్టాండ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర సిబ్బంది 15 మందికి విశ్రాంత ఎల్ఐసీ అధికారి రవీంద్రనాథ్ చేతుల మీదుగా వస్త్రాలను అందజేశారు.

పోలేరమ్మకు విశేష పూజలు



చేజర్ల: మహర్నవమి సందర్భంగా చిత్తలూరులోని పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడమని అమ్మవారిని వేడుకుంటూ గ్రామస్తులు పూజలు చేశారు.

ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

సోమశిల: అనంతసాగరం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈ క్రాప్ జాబితాలను శుక్రవారం ప్రదర్శించినట్లు ఏఓ పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జాబితాల్లో మార్పులు, చేర్పులు ఉంటే వీఏఏలను సంప్రదించాలని రైతులకు సూచించారు.

ఉత్తర కాలువ పరిశీలన

కలిగిరి: జిర్రావారిపాళెం వద్ద ఉత్తర కాలువను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లపాడుకు ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీల సోమశిల జలాలను అందించాల్సి ఉందన్నారు. జిర్రావారిపాళెం వద్ద ఉత్తర కాలువపై రాకపోకలు సాగించడానికి రైతులు చిన్న తూములతో అడ్డుకట్ట వేయడంతో సాగునీరు ముందుకు కదలడం లేదన్నారు. ఉత్తర కాలువ ఆధునీకరణకు రూ.150 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే రైతులకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జిల నిర్మాణం చేపడతామన్నారు. కాలువలో నీరు సజావుగా ముందుకు సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. రాళ్లపాడు ప్రాజెక్ట్ డీఈ హజరత్తయ్య, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

రతన్ టాటాకు నివాళి



ఆత్మకూరు: పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రతన్ టాటా సంతాప సభను శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదర్శ జీవితానికి నిలువెత్తు నిదర్శనం రతన్ టాటా అని, పారిశ్రామిక దిగ్గజం, మానవతావాది అయిన ఆయన మరణం తీరని లోటు అన్నారు. జేవీవీ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

జయ జయహే మహిషాసురమర్దిని

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మహర్నవమి సందర్భంగా కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చింది.

కావలి: పట్టణంలోని వడ్డిపాళెంలో ఉన్న కనకదుర్గా భవానీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు అభయమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం దసరా పండగ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, జ్వాలాముఖి ఆలయం, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గా ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

మహర్నవమి సందర్భంగా పట్టణంలోని శివాలయం, జ్వాలాముఖి ఆలయాల్లో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో, జ్వాలాముఖి ఆలయంలో పలువురు దంపతుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి సమర్పించారు. భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.

చేజర్ల: బోడిపాడులోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. పాలకొండ రత్నారెడ్డి, విజయ, బీ ప్రభాకర్ రెడ్డి, మంజుల ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని సోమేశ్వరాలయంలో కామాక్షిదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు అభయమిచ్చింది. కాగా విజయదశమి సందర్భంగా అనంతసాగరం చెరువు కట్ట వద్ద ఉన్న కోదండ రామాలయంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, పల్లకిసేవ, మధ్యాహ్న అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనుమసముద్రంపేట: స్థానిక శ్రీకృష్ణ మందిరంలో మహిషాసురమర్దిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా రాజా వెంకటరమణయ్య దంపతులు, కుమారులు రాజా హరికిషోర్, రాజా అవినాష్, రాజా కొండలరావు వ్యవహరించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం మహిషాసురమర్దిని అలంకారం, సంతానలక్ష్మీదేవి ఆలయం మహాకాళిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది.

సీతారామపురం: మండలంలోని ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలో కొలువైన ఇష్టకామేశ్వరీదేవి, నారాయణప్పపేటలోని విజయకనకదుర్గాదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. సీతారామపురంలోని వాసవీమాత ఉయ్యాల ఉత్సవం సందర్భంగా కన్యకాపరమేశ్వరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

కలిగిరి: మండలంలోని తెల్లపాడులోని శ్రీభద్రకాళి ఆలయంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిసాసురమర్దినిగా దర్శనమిచ్చారు.

వరికుంటపాడు: మహర్నవమి సందర్భంగా తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో సిద్ధిధాత్రిదేవి, వరికుంటపాడులోని నాగర్పమ్మ ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



కావలి: వడ్డిపాళెంలోని కనకదుర్గా భవానీ ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం



సోమశిల: మహిషాసురమర్దినిగా కామాక్షితాయి



సీతారామపురం: కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత



ఆత్మకూరు శివాలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం



కావలి: కనకదుర్గాభవానీని దర్శించుకుంటున్న భక్తులు



వరికుంటపాడు: సిద్ధిధాత్రిదేవిగా మానసాదేవి



సీతారామపురం: మహిషాసురమర్దినిగా విజయ కనకదుర్గాదేవి



సీతారామపురం: మహిషాసురమర్దినిగా ఇష్టకామేశ్వరీదేవి



చేజర్ల: సౌభాగ్యలక్ష్మిగా మహాలక్ష్మి



ఆత్మకూరు: కాశీనాయన ఆశ్రమంలో..



ఉదయగిరి: మహాకాళిగా సంతానలక్ష్మి



వరికుంటపాడు: మహిషాసురమర్దినిగా నాగారప్పమ్మ



కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం



ఏఎస్‌పేట: మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి



ఆత్మకూరు: మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి



ఆత్మకూరు: మహిషాసురమర్దినిగా జ్వాలాముఖి

దసరా సందడి





ఆత్మకూరు: పట్టణంలో శుక్రవారం దసరా సందడి నెలకొంది. బస్టాండ్ సెంటర్, బీఎస్సార్ సెంటర్, సోమశిల రోడ్డు సెంటర్, ప్రియదర్శినినగర్ సెంటర్, తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఏర్పాటైన అరటి పిలకలు, పూలు, బూడిద గుమ్మడి కాయల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ నెలకొంది. విజయదశమి రోజున వాహనాలు, ఇళ్లు, దుకాణాలకు బూడిద గుమ్మడి కాయలతో దిష్టితీస్తుంటారు. దసరా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సమీప గ్రామాల రైతులు తాము పండించిన బూడిద గుమ్మడికాయలను ట్రాక్టర్లపై తీసుకొచ్చి విక్రయాలు చేశారు.

ఇసుక రీచ్ పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఇసుకరీచ్‌ను మైనింగ్ ఆర్ఐ సీహెచ్ స్వాతి శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16 నుంచి ఇసుక రీచ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇసుక రీచ్‌తో పాటు ఇసుక డంపింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ వాణీశ్రీ, వీఆర్వో అశోక్, సర్వేయర్ అమానుల్లా ఉన్నారు.

బ్యాగుల పంపిణీ



ఆత్మకూరు: పట్టణం, మండలంలోని చర్చిల పాస్టర్లకు పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎడ్వర్డ్, శిరీషా శుక్రవారం బ్యాగులు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవలకు సెలవు

- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- పునరుద్ధరించని కూటమి ప్రభుత్వం
- ప్రజలకు తప్పని తిప్పలు

సంగం: గతంలో ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజల కష్టాలను గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే సేవలను అందించింది. సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించి ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. వలంటీర్ల సేవలకు మంగళం పాడింది. సచివాలయాల ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు.

సచివాలయాల్లో 545 రకాలు సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల ద్వారా 545 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వ్యవసాయ, ఆరోగ్య సేవలను అందించింది. మండల కేంద్రాలకు వెళ్లే బాధ లేకుండా ఇంటి ముంగిటే సేవలు అందించడంతో సచివాలయాలకు ప్రజల ఆదరణ లభించింది.



సంగం-1 సచివాలయం

తెరుచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాల వైభవం తగ్గిపోయింది. వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇది మంచి ప్రభుత్వం ప్రచారాన్ని సైతం వారే చేపట్టారు. గతంలో సచివాలయాల ద్వారా అందించిన సేవలు ప్రస్తుతం తగ్గుతూ వస్తున్నాయి. కులం, ఆదాయం, 1బీ, తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు ఎంతో అవసరమైన రేషన్‌కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, తదితర సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లు ఓపెన్ కావడంలేదు. దీంతో సచివాలయాల చుట్టూ ప్రజలు నిత్యం తిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా వెబ్‌సైట్‌లు తెరుచుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సైతం ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో ఉండిపోయారు. కొత్త వాటిని మంజూరు చేయకపోయినా గతంలో ఉన్న వాటిలో తప్పొప్పుల సవరణలు చేసేందుకైనా అవకాశం కల్పిస్తే బాగుంటుందని సచివాలయ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో సచివాలయాల సంఖ్య

ఏఎస్‌పేట	13
అనంతసాగరం	16
ఆత్మకూరురూరల్	11
ఆత్మకూరు అర్బన్	8
చేజర్ల	15
మర్రిపాడు	17
సంగం	13

నాడు విమర్శలు..నేడు సేవలు

సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసే సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ విమర్శలు చేసింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ వారితోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీ, ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అతికించే కార్యక్రమం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారానే చేయిస్తోంది. అయితే ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను మళ్లీ సచివాలయాల్లో పునఃప్రారంభిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు పేర్కొంటున్నారు.